# పునర్జన్మ

నేను ఆఫీసు నుండి ఇంటికి రాగానే ముందుగా సునీత కనిపించింది. తను రాధ కొడుకును ఆడిస్తోంది.

"రాధ వచ్చిందా?" అన్నాను.

అవునని తలూపింది.

"మళ్లీ గొడవలా?" అన్నాను. తిరిగి తల ఊపింది. ఇంతలో బాబు "మామా మామా" అంటూ నాపైకి ఎగబడ్డాడు. వాడిని తీసుకొని వంటింట్లోకి వెళ్లాను. అమ్మా రాధ ఏదో మాట్లాడుకుంటున్నారు. నన్ను చూడగానే ఊరుకుండిపోయారు. ఒక పీట వాల్చుకున్నాను. సునీత బాబును తీసుకుని బయటకు వెళ్లింది. అమ్మ నాకు కాఫీ ఇచ్చింది.

"అంతా బాగేనా రాధా?" అన్నాను. అది కొంగులో మొహం దాచుకుని వెక్కటం ప్రారంభించింది. అమ్మ అంది "దాని బాగు మూడేళ్ల నుంచి చూస్తున్నదే కద వాసూ. ఆ మనిషి మారడు. దీని కష్టాలు తీరవు. దీనికి తోడు ఆ బిడ్డ ఒకడు. ఏం తలరాతో దీనిది" అని నిట్టూర్చింది.

తమ్ముడు రాఘవ వచ్చినట్టున్నాడు. వాళ్ల వదిననేదో అడుగుతున్నాడు. నేనివతలికి వచ్చాను.

"రాధ మళ్లీ వచ్చిందటగా" అన్నాడు. నేను తలఊపాను.

"రెండు రోజులకొకసారి పుట్టింటికి పరుగెత్తుకొస్తుంటే ఆ సంసారం గడిచినట్లే" అన్నాడు గట్టిగా.

"రాఘవా" అన్నాను కాస్త మందలింపుగా.

"నేను నీలా మాటలు మనసులో దాచుకొనేవాడిని కాదు. ఉన్నదేదో పైకే అంటాను. నిజమే దీని మొగుడు తాగుబోతు. కొడతాడు. తిడతాడు. అత్తమామలు పట్టించుకోరు. మనం చెయ్యగలిగినంత చేశాం. చెప్పగలిగినంత చెప్పాం. ఇంకేం చెయ్యగలం! అది కాస్త ఓర్చుకోవాలి మరి."

నేను మాటలు పెంచకుండా అక్కడినుండి కదిలాను. ఆ రాత్రి భోజనాలన్నీ మౌనంగానే జరిగాయి. ఆ తర్వాత సునంద స్కూలు పుస్తకాలు ముందు వేసుకు కూర్చుంది. శ్రీనాథ్ ఏవో డ్రాయింగులు వేసుకొంటున్నాడు.

రాధ మాట మళ్లీ రాఘవే ఎత్తాడు. "ఇప్పుడు కొత్తగా ఏం జరిగిందే?" బాబును ఒడిలో జోకొడ్తున్న రాధ నెమ్మదిగా అంది. "ఇంక ఆ ఇంటికి నేను వెళ్లను..."

అందరం గతుక్కుమన్నాం.

"వెళ్లక?" రాఘవ అడిగాడు.

"ఇక్కడే ఉంటాను"

"అదెలా కుదురుతుందే, నీ భర్తా, సంసారం ఉండగా" అన్నాను నెమ్మదిగా. రాఘవ అందుకున్నాడు. "నానుస్తావేమిటన్నయ్యా, దాని పెళ్లి చేశాం. మన బాధ్యత తీరింది. ఆ అప్పులింకా తీరనేలేదు. ఇంకా చదువుకొంటున్న తమ్ముడూ, చెల్లీ ఉన్నారు. రేపు నీకూ పిల్లలు పుడతారు. నాకూ పెళ్లవుతుంది. ఇన్ని బాధ్యతలమధ్య మరో ఇద్దరిని జీవితాంతం పోషించటం...."

"రాఘవా..." సునీత కొంచెం గట్టిగానే పిలిచింది. నొచ్చుకొంటున్నట్టు స్వరం తగ్గించి, "రాఘవా రాధ మన పాప. ఈ ఇంట్లో పుట్టిన వాళ్లందరికీ ఈ ఇంట్లో ఉండే హక్కు ఉంది. అదృష్టం కొద్దీ కొన్ని జీవితాలు బాగుపడుతాయి. కొన్ని బాగుపడవు. మనవాళ్లు, తనవాళ్ళు అని ఉన్నది ఒకరినొకరు ఆదుకోవటానికి, అంతేగాని జీవితాలు మీ అక్కౌంట్ల పుస్తకాలు కావు లెక్క పూర్తవగానే మూసెయ్యటానికి."

రాఘవ వాళ్ల వదిన మాటలకు కాస్త తగ్గాడు. "నేనేమన్నాను వదినా! దానిని తొందర పడొద్దన్నాను. కాస్త ఆలోచించమన్నాను."

"ఇక అందరూ వెళ్లి పడుకోండి. రేపు మాట్లాడుకోవచ్చుగాని" అంటూ లేచింది అమ్మ.

ఆ రాత్రి సునీత అంది "రాధపడే బాధలు మాటలకు కూడా అందవు. దీనికేదో పరిష్కారం చూడాల్సిందే."

"ప్రస్తుతానికి అది కాస్త కోలుకోనీ. తర్వాత అతనిని పిలిపించి మాట్లాడుదాం."

"ప్రతీసారీ ముంచుకొచ్చినపుడు ఇక్కడికి రావటం, కాస్త తేరుకోగానే గొర్రెను కసాయివాడి దగ్గరకు పంపినట్లు పంపడం. అతనింక బాగుపడడండి. రాధనిక్కడే ఉండనివ్వండి. ఏదయితే అది కానీ..." నేనేం మాట్లాడలేదు. ఇలాంటి విషయాలలో తొందర పడకూడదని నాకు తెలుసు.

మా బావది ఆ ఊరే. మరునాటి సాయంత్రం ఆఫీసు నుండి నేరుగా వాళ్ళింటికే వెళ్లాను. ఇంటి ముందు దీపమైనా లేదు. కాస్సేపు అక్కడే అరుగుమీద కూర్చున్నాను. పక్కింటి నుండి కాబోలు పెద్దామె వచ్చింది. "ఎవరూ" అంది దగ్గరగా వస్తూ. "ఓహో నువ్వా నాయనా? నీ చెల్లెలు మాటిమాటికి మీ ఇంటికి పరుగెత్తిపోవటం నువ్వామెను వెనకేసుకు రావడం మామూలేగా" అంది తలుపు తీసి లోపలికి వెళ్తూ. దీపం వెలిగించింది. నేనూ లోపలికి వెళ్లాను. ఆమె నేలమీదే చతికిలబడి గోడకానుకొంది. నేనక్కడే కర్ర కుర్చీ మీద కూర్చున్నాను. "మా అదృష్టం ఏమిటో ఉన్న ఒక్క కొడుకు అట్లా, వాడి సంసారం ఇట్లా..."

"పెద్ద వాళ్ళు మీరు నచ్చజెప్పరాదండి"

"ఏందయ్యా నచ్చజెప్పేది? ఆ చెప్పేదేదో నీ చెల్లెలికి చెప్పు. లోకంలో ఎందరు లేరు గుట్టుగా సంసారాలు చేసుకొనేవారు? భార్యాభర్తలన్న తర్వాత ఎన్నో ఉంటాయి. మగమహారాజు, సంపాదించేవాడు, కడుపుకింత తిండి పెట్టేవాడు. నాలుగు మాటలన్నా, నాలుగు దెబ్బలువేసినా ఆడదే ఓర్చుకోవాలి. వీధిన పడితే అవుతుందా?"

మరీ దారుణమనిపించింది. తిండికోసం, కేవలం తిండి కోసం అంత హీనంగా బతకాలా? మనం అతి క్షుద్రంగా భావించే కుక్క కూడా కారణం లేకుండా కొడితే తిరగబడుతుందే. కాస్తో కూస్తో సంస్కారమున్న మనం... మనుషులం...

"అసలు నాలుగు మాటలని దెబ్బలు వేయవలసిన అవసరమేముందండీ? మీరు పెద్ద వాళ్ళు ఉండీ..."

“ఏం పెద్దరికంలే. వాడేనాడు మా మాట విన్నాడు గనుక? ఏమైనా అంటే “నా పెళ్లాం. నా ఇష్టం. చంపుతాను, నరుకుతాను. మీకు ఇష్టం లేకుంటే ముసలాళ్లిద్దరూ వెళ్లండి” అంటాడు. వాడు సంపాదనపరుడాయె. మా దగ్గరేముంది?”

ఇంతలో తలుపులు ధడాలుమనిపిస్తూ తూగుతూ లోపలికి వచ్చాడు మా బావ. “ఎవరితో మాట్లాడుతున్నావు ముసల్దానా?”

“నేను బావా! వాసూను”

“ఓహో! వాసుదేవరావుగారా? నమస్కారం. నమస్కారం. దాన్ని తీసుకొచ్చారేమిటి? మిమ్మల్ని చూసుకొనే దానికంత పొగరు. నేనేం తక్కువవాడిని కాదు. నాకూ తెలుసు దానిని ఎలా అదుపులో పెట్టాలో. ఒసే రాధా ఇలా చావు. నీ అన్న ఉంటే నాకేం భయంలేదు. నిన్న వెదురుకర్రే విరిగింది. ఈ రోజు నీ ఎముకలే విరుగుతాయి. ఇలారా ఎవడు అడ్డువస్తాడో చూస్తాను.”

నాకు ఒళ్లు మండింది. “నీవంతగా గొంతు చించుకోవనవసరం లేదు. రాధ ఇక్కడ లేదు. అసలు మొదట్లో మా రాధ గుట్టుగానే ఉంది. కాని నువ్వు పెట్టే వాతలు, సిగరెట్టు కాల్పులు, దౌర్జన్యాలు రోజు రోజుకు పెరిగిపోతుంటే దాని ఏడుపు మాకు వినిపించకుండా ఎలా ఉంటుంది? ఇన్నాళ్లూ మేమూ ఓపిక పట్టాం. చాలు చాలు మీ దాంపత్యం. మా పిల్ల మా ఇంట్లోనే ఉంటుంది. మాకేం బరువుకాదు...”

“ఆ మాటమీదే ఉండు మగాడివయితే. దాని పోషణకని, బిడ్డఖర్చుకని నా దగ్గరకు రాకు. మీతో మా సంబంధం ఈనాటితో సరి...”

“దాని నగలు...”

“నగలు గిగలు జాన్తానై. కదలవయ్యా ఇంట్లోనుండి. ఎక్కువగా మాట్లాడావంటే నీ చెల్లెలే చెడిపోయిందంటాను. ఆ బిడ్డ నాకు పుట్టలేదంటాను. కోర్టుకెళ్లి గెలుచుకోవయ్యా కేసు...”

ఆ రాక్షసుడు ఏదో వాగుతూనే ఉన్నాడు. నేను చరా చరా వచ్చేశాను.

ఆ రాత్రి రాఘవ మళ్లీ అడిగాడు. “రాధ సంగతి ఏం చేద్దామన్నయ్యా?”

“బజారుకెళ్లి ఎక్కడైనా కాస్త విషం దొరుకుతుందేమో కనుక్కో. దానికి కొంచెం తాపి

మనమూ తాగుదాం. అదీ నచ్చకపోతే దాన్నీ, దాని కొడుకునూ చంపేద్దాం. ఈ భోగభాగ్యాలన్నీ మనమే అనుభవించవచ్చు."

"అన్నయ్యా..."

"అవునురా. అది మన చెల్లి. మనం ఎత్తుకు తిప్పిన పిల్ల. మనలాగే మన అమ్మకడుపున పుట్టింది. కాని ఇప్పుడది భారమయింది. ఎందుకంటే దానికి సంపాదన లేదు. చదువు సంధ్యలు లేవు. ఏదో వదిలించుకునే మార్గంగా ఒక సంబంధం చేశాం. వాడూ కిరాతకుడు దొరికాడు. అది కుమిలి కుమిలి చావటంకంటే ఒక్కసారిగా చస్తే పీడా వదులుతుందికదా".

"మీరేం మాట్లాడుతున్నారో మీకు అర్థమవుతోందా? రాధ ఇంట్లోనే ఉంది. ఆ అమ్మాయి ఏదో ఒక వస్తువైనట్లు ఈ వాద వివాదాలేమిటి?" సునీత నెమ్మదిగానే చెప్పినా దృఢంగా చెప్పింది. అంత నోరు చేసుకొన్నందుకు నాకూ సిగ్గనిపించింది.

ఆ తర్వాత ఎప్పుడూ మా ఇంట్లో రాధ సంసారం గురించి చర్చలు జరగలేదు. అప్పటికి రాధ ఇరవై ఏళ్ళ పిల్ల. వాళ్ల అత్తవారికీ, మాకూ పూర్తిగా సంబంధాలు పోయాయి. దారిలో ఎక్కడైనా కనిపించినా వాడు మమ్మల్ని చూడనట్లే పోయేవాడు.

మాది చిన్న ఊరు. అందరూ తమ చుట్టూ గిరిగీసుకొని ఆ పరిధిలోనే బతికేస్తుంటారు. వాళ్లకు నీతి, అవినీతి, సంప్రదాయం, కులం, మానం, మర్యాద అనేవి ఏకముఖంగా, గానుగెద్దు తీరులో ఉంటాయి. వాళ్లకు కాలక్షేపానికి మాటలు కావాలి. మాటల కోసం విషయం ఉండాలి. ఇరుగు పొరుగుల కథల కంటే ఆసక్తికరమైన విషయాలేముంటాయి? అందుకే కొత్తకొత్తలో వచ్చిన వాళ్లకు రాని వాళ్లకు రాధ మొగుడిని వదిలేసిందో, మొగుడు రాధను వదిలేశాడో చెప్పలేక అమ్మ సతమతమయ్యేది. మేమేమో తప్పించుకు తిరిగేవాళ్ళం.

రెండేళ్లు ఇలాగే గడిచాయి. రాధ సంసారం విషయం పాతబడింది. ఇంతలో మరో దుమారం. రాధ భర్త ఇంకో పెళ్లి చేసుకొంటున్నాడని.

"ఇప్పుడేం చెయ్యాలమ్మా" అని అమ్మనడిగాను. రాధను అడిగే ధైర్యం లేదు. మా ఏడాది సుందర్‌కు స్నానం చేయించి తెచ్చి టవలుతో తుడుస్తోంది రాధ.

అమ్మ నెమ్మదిగా అంది "విన్నావా రాధా మీ అన్నయ్య ఏమి చెబుతున్నాడో?"

"విన్నాను"

"మనం ఊరుకోవటమేనా?" అన్నాను.

"ఊరుకోక చేసేదేముంది? నా దృష్టిలో ఆ వ్యక్తి లేడు. ఆయనకు సంబంధించిన విషయాలూ లేవు."

"అంటే బతికినంతకాలం మాకు ఊడిగం చేస్తూనే ఉంటావా? మా పిల్లలకు, వాళ్ల పిల్లలకు..."

సుందరాన్ని ఒడిలో కూర్చోబెట్టుకొని పౌడరు అద్దుతోంది. "ఎక్కడున్నా ఇంటి పనులు చేసుకోవలసిన దానినే. మన వాళ్ళకు చెయ్యటం ఊడిగమెందుకవుతుంది?" కాస్త ఆగి, "నా దృష్టిలో ఆ మనిషి ఎప్పుడో పోయాడు" అని అక్కడినుండి లేచి వెళ్లిపోయింది. అమ్మ అవాక్కయింది.

మరో రెండేళ్లు గడిచాయి. ఇరుగమ్మ, పొరుగమ్మ కూడా రాధ మా ఇంట్లో ఉండటాన్ని చాలా సహజంగా తీసుకున్నారు. మా రాఘవకు పెళ్లయింది. వాడు అక్కౌంట్సు ఆఫీసరయ్యాడు. డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లిపోయాడు. నాకూ ప్రమోషన్ వచ్చింది. హైదరాబాద్‌కు బదిలీ అయింది.

రాధను మాతోపాటే రమ్మన్నాం. అమ్మ వద్దంది. "ఇక్కడే ఉండనీరా. నీకు అక్కడ బోలెడు ఖర్చు. ఇక్కడ మేమెలాగో గడుపుకుంటాం. పొలం మీద వచ్చే దానితో ఇల్లు గడుస్తుందిలే."

"పై ఖర్చులకు నేను కొంత పంపుతాలే అమ్మా. రాఘవకు కూడా వ్రాస్తాను" అన్నాను.

"వద్దురా. వాడదోరకం. వాడి భార్య కూడా అంత కలివిడిమనిషి కాదు. వాళ్లయివాళ్లు పంపితేసరి. నువ్వు మాత్రం వాడికి రాయొద్దు?"

మేమిద్దరం మా ఇద్దరు పిల్లలతో హైదరాబాద్ చేరుకున్నాం. ఓ సంవత్సరం ఇట్టే గడిచిపోయింది. అనుకోకుండా ఒక రోజు రాధ దగ్గిరి నుండి ఉత్తరం వచ్చింది. పాపం దానికి ఉత్తరాలు వ్రాసే అలవాటు కూడా లేదు. కొక్కిరిబిక్కిరి అక్షరాలతో పది పంక్తులు వ్రాసింది. ఆ ఉత్తరం చదివి చాలా ఆశ్చర్యపోయాను. సునీత కిచ్చాను. సునీత ఏమీ మాట్లాడలేదు.

"అసలే ఇది ఒక సమస్య అయిందనుకొంటే మరో సమస్య సృష్టించేటట్లుంది" అన్నాను.

"సమస్య ఏముంది? కాస్త నింపాదిగా ఆలోచించండి. తను సమస్యకు పరిష్కారం చూపిస్తోంది."

"సునీతా! నువ్వు పట్టణం పిల్లవు. చదువు కొన్నదానివి. ఇప్పుడు మహానగరంలో ఉంటున్నావు. ఎంత గొప్పగానైనా ఆలోచించగలవు. మన చిన్న ఊరి గురించి ఆలోచించు. మన సమాజం, సంప్రదాయం, ఇరుగూ, పొరుగు... ఆ ఊళ్లోనే ఉండవలసిన అమ్మ... ఇంకా సునందకు పెళ్లి కావాలి. మంచికీ, చెడుకూ పలికే బంధువర్గం కావాలి..."

సునీత నన్నే వింతగా చూస్తోంది.

"ఏమిటలా చూస్తున్నావు?"

"ఇన్నాళ్లూ మీ గురించి నేనెంతో గర్వపడే దాన్ని. మీ మంచితనానికి పొంగిపొయ్యేదాన్ని. అందరిలా ప్రగల్భాలు పలకరు, చేసే మంచేదో చేసి చూపిస్తారనుకొనే దాన్ని. కానీ ఇప్పుడు మీరు ఆలోచిస్తున్న తీరు... ఇంతేనా మీ గుండె బలం?"

"నువ్వు ప్రాక్టికల్‌గా ఆలోచించు. మొండితనాన్ని గుండెబలమనరు."

"నేను ప్రాక్టికల్‌గానే ఆలోచిస్తున్నాను. రాధను మీరు చదివించలేదు. ఏదో విధంగా పెళ్ళి చేశారు. చెప్పరాని, చెప్పుకోలేని బాధలకు గురవుతున్నప్పుడు అక్కడే ఉంచాలని చూశారు. తెగువ ఉన్నందున ధైర్యం చేసి వచ్చేసింది. సమాజాన్ని ఎదుర్కొంది. ఇన్నాళ్లకు తనను తనుగా ప్రేమించేవాడు పెళ్లి చేసుకోటానికి ముందుకొచ్చాడు. ఇంకేం కావాలి? ఎంత ప్రేమ ఒలకపోసినా ఆ ఇంట్లో రాధకున్న స్థానమేమిటి? ఇంకా ముందు ముందు ఎన్నో మార్పులొస్తాయి. ఆమె భారాన్ని, ఆమె కొడుకు భారాన్ని నెత్తిన వేసుకొనే వాళ్లున్నారా? తనకంటూ ఒక ఇల్లు ఏర్పడుతుంది. ఇక ముందయినా సుఖపడుతుంది. మీ మీద ఎంత నమ్మకం లేకపోతే ఈ ఉత్తరం వ్రాస్తుంది?"

"మరి సునంద సంగతి..."

"ఎవరి అదృష్టాన్ని ఎవరు పాడుచెయ్యగలరు? కాకపోయినా ఆ అమ్మాయిని ఇంకా పై చదువులు చదివించాలనేది మాత్రం మరవకండి."

"అమ్మ ఏమంటుందో? పాతకాలం మనిషి."

"మీ పిచ్చిగాని ఏ తల్లి కూతురి సుఖం కోరుకోదని? ఒకోసారి మనం పాతకాలం మనుషులనుకొనే వాళ్లే చాలా ఆధునికంగా ఆలోచిస్తారు."

నేను మూడు రోజులు సెలవు పెట్టి ఆ ఊరు వెళ్లాను. ఆ అబ్బాయిని కలిశాను. స్కూలు టీచరు నాకూ నచ్చాడు. అతని భుజం తట్టి వచ్చేశాను ఇంటికి.

"అమ్మా, రాధ..."

"నాకు తెలుసురా" అంది అమ్మ. "ఎక్కడో ఒక చోట అది సుఖపడనీ. రాఘవకు తెలిస్తే దీన్ని తవ్విపాతేస్తాడు. ఇక్కడ చుట్టుపక్కలవాళ్ళు ఛీ కొడతారు. కొన్నాళ్ళే అదంతా. దాని బతుకు బాగుపడటానికి మనం ఆ మాత్రం మాటలు పడలేమా?"

అమ్మధైర్యానికి విస్తుపోయాను. హైదరాబాద్ వచ్చేస్తూ రాధ చేతిలో వెయ్యి రూపాయలు పెట్టాను. అది నా కాళ్లకు దండం పెట్టింది. "బదిలీ చేయించుకొంటారట" అంది. దాని తల నిమిరి వచ్చేశాను.

మరో పదిహేను రోజులకు రాఘవ నుండి ఘాటుగా ఉత్తరం వచ్చింది. "రాధ చచ్చినా బాగుండేది. ఇప్పుడైనా చచ్చినట్లే లెక్క. అందుకే శ్రాద్ధం పెట్టేస్తున్నాను..."

*(25 ఆగస్టు 1991)*